షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు · తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 207 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 09 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 207 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE June 09, 2024 PAGES : 8 PRICE : 3/-

## ఆర్థిక పరిస్థితిపై సిఎస్ ఆరా

### అధికారులతో నీరబ్ కుమార్ సమీక్ష నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు



అమరావతి,జూన్8(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్ సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి నీరభ్ కుమార్ ప్రసాద్.. ఇక, వెంటనే మిగతా 2లో..

# యోధుడి నిష్క్రమణ

## మీడియా దిగ్గజం రామోజీ కన్నుమూత



- అస్వస్థతలో ఆస్పత్రిలో తుదిశ్వాస
- ఫిలిం సిటీకి భౌతిక కాయం తరలింపు
- దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన సిఎం రేవంత్
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం
- ఘనంగా నివాళి అర్పించిన ప్రముఖులు
- రామోజీ మృతికి చంద్రబాబు దిగ్భ్రాంతి
- మీడియా రంగంలో ఆయనది ప్రత్యేక శకం
- అసామాన్య విజేత అంటూ చంద్రబాబు నివాళి
- రామోజీ మృతికి సినీ ప్రముఖుల దిగ్భ్రాంతి
- రాజమౌళి, కీరవాణి, రాజేంద్రప్రసాద్ తదితరుల నివాళి

నేడు చిత్ర పరిశ్రమ బందుకు పిలుపు



## రామోజీ మహత్తర దార్శనికుడు

- మీడియాను విప్లవాత్మకంగా మార్చిన యోధుడు
- ఆయన మృతి పత్రికా రంగానికి తీరనిలోటు
- సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ
- సంతాపం తెలియచేసిన రాజ్‌నాథ్, ఖర్గే, మమత తదితరులు

న్యూఢిల్లీ,జూన్8(షణ్ముఖవెలుగు): మీడియా దిగ్గజం రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మోదీ రామోజీరావుకు నివాళులు ప్రకటించారు. భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడు రామోజీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన సహకారం జర్నలిజం, సినిమా ప్రపంచంలో చెరగని ముద్ర వేసిందన్నారు. రామోజీ అవిశ్రాంత ప్రయత్నాల కారణంగా మీడియా, వినోద ప్రపంచంలో ఎన్నో ఆవిష్కరణలు, కొత్త ప్రమాణాలు నెలకొల్పారని వెల్లడించారు. ఈ క్రమంలో రామోజీరావు మృతికి సంతాపం తెలుపుతూ భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడని ప్రధాని మోదీ అభివర్ణించారు. దీంతోపాటు ఆయనతో మాట్లాడటం, ఆయన నుంచి ప్రయోజనం పొందే అవకాశాలు లభించడం నా అదృష్టమని మోదీ అన్నారు. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అసంఖ్యాక మిగతా 2లో..

## రామోజీరావు మరణం బాధాకరం

- రాజీలేని జీవితం గడిపిన రామోజీ
- దేశంలో అంతటి పలుకుబడి ఉన్న వ్యక్తిని చూడలేదు
- మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ వ్యాఖ్య
- బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ రావు
- ఆయన లేరన్న వార్త జీర్ణించుకోలేక పోతున్నా
- తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేసిన జనసేనాని
- రామోజీరావు పేదల పక్షపాతి
- నివాళి అర్పించిన నారా లోకేశ్

రాజమండ్రి,జూన్8(షణ్ముఖవెలుగు): భారతదేశంలో రామోజీరావు అంత పలుకుబడి ఉన్న వ్యక్తిని తాను మరెక్కడా చూడలేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. రామోజీరావు మరణం వార్త తెలిసిన తర్వాత రాజమండ్రిలో మీడియాతో మాట్లాడారు. రామోజీరావు మరణం బాధాకరం అని, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి అని తెలిపారు. ఆయన ఎవరితోని రాజీ పడకుండా పూర్తి జీవితం గడిపారన్నారు. ఆయనను కలుద్దామని చాలాసార్లు ప్రయత్నం చేశాను కానీ సాధ్యం కాలేదన్నారు. రామోజీరావు ఏ రంగంలోకి ప్రవేశించినా ఒక సెలబ్రిటీ స్థాయికి ఎదిగారని గుర్తు చేసుకున్నారు. రామోజీరావుపై ఆర్థిక పరమైన ఆరోపణలు చేసి ఆయనపై కోర్టుల్లో పిటిషన్లు వేసింది ఉండవల్లి అరుణ్ కుమార్. ఈ సంస్థ చట్టపరమైన నిబంధనలు పాటించడం లేదంటూ మిగతా 2లో..

## రామోజీ మృతికి ఎపిలో రెండు రోజులు సంతాప దినాలు

అమరావతి,జూన్8(షణ్ముఖవెలుగు): రామోజీరావు నివాళిగా 2 రోజుల పాటు ఏపీ ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించింది. ఈ మేరకుఅధికారిక ఉత్తర్వులను ఏపీ ప్రభుత్వం జారీ చేసింది. ఈ నెల 9, 10 మిగతా 2లో..

## దాడులకు పాల్పడుతున్నా పోలీసుల ప్రేక్షక పాత్ర

### వారిపై కోర్టుల్లో కేసులు వేస్తాం: కొడాలి నాని



గుడివాడ,జూన్8(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్న వారిపై, అడ్డుకోలేని పోలీసులపై హైకోర్టులో కేసు వేయనున్నామని మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు కొడాలి నాని వెల్లడించారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ, జనసేన నాయకులు ఉద్దేశపూర్వకంగా వైసీపీ శ్రేణుల పై దాడులకు పాల్పడుతున్నారని మిగతా 2లో..

## నేడు ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం

- మోడీతో ప్రమాణం చేయించనున్న రాష్ట్రపతి
- ప్రమాణస్వీకారోత్సవానికి ముస్తాబైన రాష్ట్రపతిభవన్
- సాయంత్రం 7.15 గంటలకు ప్రమాణ కార్యక్రమం
- ఢిల్లీ అంతటా భద్రత కట్టుదిట్టం.. కమెండోల పర్యవేక్షణ
- ఢిల్లీకి చేరుకుంటున్న విదేశీ ప్రముఖులు



న్యూఢిల్లీ,జూన్8(షణ్ముఖవెలుగు): నరేంద్రమోదీ మూడోసారి భారతదేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రధానిగా ప్రమాణం చేస్తారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు కూడా ప్రమాణం చేస్తారు. ఇందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని, మంత్రులతో ప్రమాణం చేయిస్తారు. మోడీ వరుసగా మూడోసారి ప్రమాణం చేయడం ద్వారా తొలిప్రధాని నెహ్రూ రికార్డును సమం చేయబోతున్నారు. ఇప్పటికే 2014, 2019ల్లో ఆయన రెండు పర్యాయాలు ప్రధానిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో మరోసారి ప్రజలు మిగతా 2లో..

## కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా సోనియా గాంధీ

- లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేతగా రాహుల్
- సీడబ్ల్యూసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- రాహుల్ జోడో యాత్రతో కాంగ్రెస్‌కు ఆదరణ
- ఎన్నికల్లో ఎన్నో రకాలుగా అడ్డంకులు సృష్టించారు
- అయినా కాంగ్రెస్ ధైర్యంగా నిలబడి గెలిచింది
- సమావేశ వివరాలను వెల్లడించిన కేసీ వేణుగోపాల్
- రాహుల్ జోడోతో పెరిగిన కాంగ్రెస్ బలం
- సిడబ్ల్యూసి సమావేశంలో ఖర్గే వెల్లడి
- పార్లమెంట్‌లోను, వెలుపలా కూటమి పాత్ర అదే
- లోక్‌సభ ఎన్నికల తీర్పుతో విభజనవాదాలకు తిరస్కరణ
- సిడబ్లుసి సమావేశంలో పార్టీ అధ్యక్షుడు ఖర్గే



న్యూఢిల్లీ,జూన్8(షణ్ముఖవెలుగు): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ ఎంపికయ్యారు. శనివారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని జరిగింది. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, మిగతా 2లో..



కొత్త ప్రభుత్వం ఏర్పడబోతున్న తరుణంలో ..జిల్లా ప్రాధాన్యం పెరగనుంది. చంద్రబాబు మంత్రివర్గంలో అచ్చన్నాయుడు ఖచ్చితంగా మంత్రి అవుతారని ప్రచారం ఉంది. టిడిపి అధ్యక్షుడిగా, సీనియర్ నేతగా ఉన్న అచ్చన్నకు తొలి జాబితాలోనే పదవి దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదిలావుంటే ఎర్రన్నాయుడు తనయుడు రామమోహన్ నాయుడు కూడా కేంద్రంలో ఏర్పడబోయే ఎన్‌డిఎ ప్రభుత్వంలో చోటు దక్కించుకుంటారని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే ఒకే ఇంటినుంచి ఒకరు రాష్ట్రంలో, మరొకరు కేంద్రంలో మంత్రులుగా ఉన్న ఘనత శ్రీకాకుళానికి దక్కనుంది.

## చిక్కోలుకు అరుదైన అవకాశం రానుందా?

### అచ్చన్నకు రాష్ట్రంలో..రామన్నకు కేంద్రంలో పదవులు

### రికార్డు సృష్టించబోతున్న కింజారపు కుటుంబం

శ్రీకాకుళం,జూన్8 : మొన్నటిసార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయ ఢంకా మోగించారు.. ఎనిమిదికి ఎనిమిది చోట్లా క్లీన్‌స్వీప్ చేశారు. విజేతల్లో నలుగురు కొత్తగా అసెంబ్లీ మెట్లు ఎక్కుతుండగా, మిగిలిన నలుగురు సీనియర్లే. ఈనెల 12న నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు క్యాబినెట్‌లోకి మంత్రులుగా కొందరు తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి మంత్రి యోగం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ జిల్లా వాసుల్లో నెలకొంది. ముఖ్యంగా తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, బెందాళం అశోక్, మహిళా కోటాలో గౌతు శిరీష కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియారిటీ, సామాజిక వర్గాల ప్రాతిపదికన జిల్లాకు రెండు పదవులు దక్కే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. టెక్కలి నుంచి మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన కింజరాపు అచ్చెన్నాయుడు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడిగా కీలక నేతగానూ ఉన్నారు. దీనికితోడు జిల్లాలోనూ సీనియర్ నేతగా కొనసాగుతున్నారు. గత ప్రభుత్వంపై తిరుగులేని పోరాటం చేశారు. అక్రమాలు, అవినీతిని ఎండగట్టారు. కష్టసమయంలో జిల్లా ప్రజలకు అండగా నిలిచారు. జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన పాత్రపోషిస్తున్నారు. ఈ పరిస్థితులతో అచ్చెన్నాయుడుకు మిగతా 2లో..

## ఛత్తీస్‌ఘడ్‌లో మరోమారు ఎదురుకాల్పులు

### ఏడుగురు మావోయిస్టుల హతం

రాయపూర్,జూన్8(షణ్ముఖవెలుగు): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోమారు తుపాకుల మోతతో దద్దరిల్లింది. నారాయణ్ పూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దులోని గోబెల్ అటవీ ప్రాంతంలో శనివారం భారీ ఎన్ కౌంటర్ జరిగింది. పక్కా సమాచారంతో కూబింగ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు... మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో రెండు వర్గాలు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ ఎన్ కౌంటర్ లో.. ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతిచెందినవారు నారాయణ్ పుర్, దంతేవాడ, బస్తర్, కొండగావ్ జిల్లా వాసులుగా పోలీసులు అధికారులు గుర్తించారు. సంఘటనాస్థలం నుంచి భారీగా ఆయుధ సమాగ్రి, తుపాకులను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్ కౌంటర్ కొనసాగుతోందని నారాయణపూర్ పోలీస్ సూపరింటెండెంట్ ప్రభాత్ కుమార్ చెప్పారు. శుక్రవారం రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో నారాయణపూర్ డీఆర్‌జీకి చెందిన ముగ్గురు జవాన్లను గాయపడ్డారు. వారిని ఈస్ట్ బస్తర్ డివిజన్ పరిధిలోని గోబెల్ ప్రాంతం నుంచి విమానంలో ఆస్పత్రికి తరలించారు. మే 25న బీజాపూర్‌లోని జప్పెమార్క, కమ్‌కనార్ అడవుల్లో భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు హతమయ్యారు. అనంతరం, జూన్ 2న నారాయణపూర్ జిల్లాలోని దుర్మి గ్రామంలో నక్సలైట్లు మొబైల్ టవర్‌కు నిప్పు పెట్టారు.



# రామోజీ మహత్తర దార్శనికుడు

మొదటిపేజీ తరువాయి..

అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు చెప్పారు. ఆయన మృతి దిగ్భ్రాంతికి గురిచేసినట్లు తెలిపారు. ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు. రామోజీరావు మృతితో దేశం ఓ మీడియా దిగ్గజాన్ని కోల్పోయిందన్నారు. 'రామోజీ మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. రామోజీరావు ఓ వినూత్న వ్యాపారవేత్త. ఈనాడు వార్తా పత్రిక, ఈటీవీ న్యూస్ నెట్‌వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీ సహా అనేక సంస్థలను స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించారు. తన దూరదృష్టితో ఎన్నో విజయాలు సాధించి సమాజంలో చెరగని ముద్రవేశారు. మీడియా, సినీ పరిశ్రమలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. పద్మవిభూషణ్ అందుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి' అని రాష్ట్రపతి ముర్ము తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రామోజీరావు మృతి పట్ల భాజపా, కాంగ్రెస్ అగ్రనేతలు రాజ్‌నాథ్‌సింగ్, మల్లికార్జున ఖర్గే సంతాపం ప్రకటించారు. రామోజీరావు మరణం మీడియా, సినీ రంగానికి తీరని లోటని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. మీడియా, చలనచిత్రాల రంగాల్లో ఆయన తనదైన ముద్ర వేశారన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పాత్రికేయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. సినీ నిర్మాతగా, మీడియా సంస్థల అధినేతగా, విద్యావేత్తగా రామోజీరావు అనేక సేవలు అందించారని, ఆయన మరణం విచారకరమన్నారు. మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దూరదృష్టి గల వ్యక్తి రామోజీరావు అని అన్నారు. సినిమా, పాత్రికేయ రంగానికి విశేష కృషి చేశారని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ఖర్గే ప్రకటించారు. ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుమృతి పట్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు రామోజీరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఈనాడు గ్రూప్, ఈటీవీ నెట్‌వర్క్, ఫిల్మ్ సిటీ వ్యవస్థాపకులు రామోజీరావు మరణవార్త దిగ్భ్రం÷–రతికి గురిచేసింది. కమ్యూనికేషన్ ప్రపంచానికి ప్రత్యేకంగా తెలుగు మీడియాకు ఆయన దార్శనికుడు. ఆయన గురించి నాకు బాగా తెలుసు. మంచి పరిచయం ఉంది. ఓసారి ఫిల్మ్‌సిటీకి నన్ను ఆహ్వానించారు. ఫిల్మ్‌సిటీ సందర్శన మధురానుభూతి నాకు ఇంకా గుర్తుంది. ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభులాషులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని దీదీ పోస్ట్ పెట్టారు.

## దాడులకు పాల్పడుతున్నా పోలీసుల ప్రేక్షక పాత్ర

మొదటిపేజీ తరువాయి..

శ్రేణులు ఉండవద్దని హెచ్చరిస్తున్నారని వెల్లడించారు. అల్లరి మూకలు దాడులకు పాల్పడుతుంటే పోలీసులు ప్రేక్షకులు పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. టీడీపీఅల్లరి మూకల దాడుల వీడియోలు, సీసీ ఫుటేజీలు, ఫొటోలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఎస్పీ, లోకల్ స్టేషన్‌లో ముందస్తుగా ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు రక్షణ కల్పించకపోగా దాడులకు పాల్పడ్డ వ్యక్తులపై కేసులు నమోదు చేయడం లేదని విమర్శించారు. వైసీపీ జిల్లా తరఫున హైకోర్టులో ప్రైవేట్ కేసులు వేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి భయాందోళనలకు లోను కావద్దని ఆరోపించారు.

## చిక్కోలుకు అరుదైన అవకాశం రానుందా?

మొదటిపేజీ తరువాయి..

బెర్తు ఖాయమనే పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గం నుంచి కూన రవికుమార్, ఇచ్ఛాపురం నుంచి బెందాళం అశోక్ పేర్లు వినిపిస్తున్నాయి. అశోక్ మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. సౌమ్యుడిగా పేరు ఉంది. 2019లో వైకాపా గాలిలోనూ విజయం సాధించారు. కూన రవికుమార్ ఆమదాలవలస నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచారు. తాజాగా స్పీకరు తమ్మినేని సీతారాంపైనే పోటీ చేసి గెలుపొందారు. కష్టకాలంలో తెదేపా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి కార్యకర్తలకు అండగా నిలిచారు. అధికార పక్ష నేతలు కేసులు పెట్టి అనేక ఇబ్బందులకు గురిచేశారు. గతంలో విప్‌గానూ పనిచేశారు. అశోక్, కూన ఇద్దరూ సీనియర్లు, ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఒక్కరి చోటు కల్పించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

మంత్రి పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే. మహిళ, యువత కోటాలో పలాస నుంచి గౌతు శిరీష మంత్రి పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. గౌతు లచ్చన్న మనవరాలిగా, మాజీ మంత్రి గౌతు శివాజీ కుమార్తెగా ప్రజల ముందుకొచ్చారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన శిరీష అటు వైకాపా మంత్రి అప్పలరాజు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసినా వాటిని ఎదుర్కొని అప్పలరాజుపై ఘన విజయం సాధించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి కార్యకర్తలకు ధైర్యం నింపుతూ అడుగులు వేశారు. దీంతో ఆమెకు క్యాబినెట్‌లో చోటు దక్కుతుందని కార్యకర్తలు, నేతలు ఆశిస్తున్నారు. ఇకపోతే మాజీ కేంద్రమంత్రి, దివంగత ఎర్రన్నాయుడు వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని, పార్లమెంట్ సభ్యుడిగా మూడుసార్లు గెలుపొందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు హ్యాట్రిక్‌తో సత్తాచాటారు. 2014 ఎన్నికల్లో తొలిసారి 1.27 లక్షలకు పైగా మెజార్టీ సాధించారు. తాజా ఎన్నికల్లో 3,27,901 ఓట్ల మెజార్టీతో రికార్డు సృష్టించారు. ఈ విజయం జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలిచింది. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమిలో తెదేపా చేరడం, కీలకభూమిక పోషిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాని మూడు, నాలుగు మంత్రి పదవులు ఇస్తారనే ప్రచారం సాగుతోంది. ఇందులో మొదటి పేరు రామ్మోహన్‌నాయుడిదే అంటూ ప్రచారం జరుగుతోంది. హిందీ, ఆంగ్లంతో పాటు, తెలుగులోనూ మంచి వక్తగా పేరుంది. గతంలో వాజ్‌పేయీ హయాంలో తండ్రి ఎర్రన్నాయుడు కేంద్రమంత్రిగా పనిచేశారు. ఎంపీగా పదేళ్ల రాజకీయ జీవితంలో రామ్మోహన్‌నాయుడు వివాదారహితుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్రం కోసం ఆయన పార్లమెంట్, వెలుపల చేసిన ప్రసంగాలు ప్రజలకు చేరువ చేశాయి. ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలని, రైల్వే జోన్, రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పిన తీరు ప్రజల్ని ఆకట్టుకుంది. జిల్లాలో రాజకీయ ప్రసంగాలకు ప్రజాదరణ గణనీయంగా పెరిగింది. ఆయన హాజరయ్యే సభలు, సమావేశాలకు జనం పోటెత్తడమే నిదర్శనం. పార్లమెంట్‌లోనూ వివిధ సందర్భాల్లో తన వాణిని గట్టిగా వినిపించారు. ఆయనకు ఎన్‌డిఎలో అవకాశం దక్కితే జిల్లాకు ప్రాధాన్యం పెరిగినట్లుగానే భావించాలి.

# యోధుడి నిష్క్రమణ

హైదరాబాద్,జూన్8(షణ్ముఖవెలుగు): తెలుగు పత్రికా రంగంలో విప్లవం సృష్టించిన అక్షరం రాలిపోయింది. అనంతలోకాలకు ఎగిసిపోయింది. మహోన్నత పత్రికా సామ్రాజ్యాన్ని ప్రజలకు అందించిన రామోజీరావు అనంతలోకాలు వెళ్లిపోయారు. శనివారం తెల్లావారు జామున రామోజీరావు అస్తమయం చెందారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆయనను నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. 1936, నవంబర్ 16న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. చిననాటినుంచే విలక్షణ, సృజనాత్మకత కలిగిన ఆయన.. ఈనాడు దినపత్రికను ప్రారంభించి సంచలనం సృష్టించారు. 1974, ఆగస్టు 10న విశాఖపట్టణంలో ఈనాడును ప్రారంభించారు. అనంతరం సితార సినీ పత్రిక, ఈటీవీ చానళ్లను కూడా తీసుకొచ్చి మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫిల్మ్ సిటీని నిర్మించారు. సినిమా మొత్తాన్ని అక్కడే షూటింగ్ చేసుకునేలా సకల వసతులు కల్పించారు. ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతిపై పలువురు ప్రముఖుల సంతాపం వ్యక్తం చెబుతున్నారు. రామోజీ రావు మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించారని గుర్తుచేశారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ప్రకటించారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేశారు. సీడబ్ల్యూసీ సమావేశంలో కోసం రేవంత్ ఢిల్లీ వెళ్లిన సంగతి తెలిసిందే. అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించాలని రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ ఆదేశాలు జారీచేశారు. ఇదిలావుంటే ఫిలిం సిటీకి తరలివచ్చిన ప్రముఖ నేతలు రామోజీ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయంపై తెదేపా అధినేత చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని అన్నారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.ఢిల్లీలో ఉన్న చంద్రబాబు నేరుగా ఫిల్మ్‌సిటీకి చేరుకుని భార్యతో కలసి రామోజీ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని తామంతా భావించామని.. కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసిన రామోజీరావు తెలుగు ప్రజల ఆస్తి అని.. ఆయన మరణం రాష్ట్రానికే కాదు, దేశానికి కూడా తీరని లోటని చంద్రబాబు అన్నారు. సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరం అని పేర్కొన్నారు. ఈనాడు గ్రూపు సంస్థలు స్థాపించి వేల మందికి ఉపాధి కల్పించారన్నారు. మీడియా రంగంలో రామోజీరావుది ప్రత్యేకమైన శకం అని చంద్రబాబు కొనియాడారు. ఎన్నో సవాళ్లను, సమస్యలను అధిగమించి...ఎక్కడా తలవంచకుండా విలువలతో సంస్థలను నడిపిన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు తన ప్రయాణంలో అనుక్షణం ప్రజల మంచి కోసం, సమాజ హితం కోసం రామోజీరావు పనిచేశారని అన్నారు. మీడియా రంగంలో ఆయనొక శిఖరమని, ఆయన ఇక లేరు అనే విషయాన్ని తాము జీర్ణించుకోలేక పోతున్నామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రామోజీరావుతో తన 4 దశాబ్దాల అనుబంధాన్ని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మంచిని మంచి, చెడును చెడు అని చెప్పే ఆయన తీరు.. తనను ఆయనకు ఎంతో దగ్గర చేసిందని అన్నారు. సమస్యలపై పోరాటంలో ఆయన తనకు ఒక స్ఫూర్తి అని కొనియాడారు. ప్రజలకు మంచి పాలసీలు అందించే విషయంలో తాను రామోజీ సూచనలు, సలహాలు తీసుకునేవాడినని గుర్తు చేసుకున్నారు. రామోజీ అస్తమయంపై ఆయన కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని చంద్రబాబు ప్రార్థించారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అక్కడికి తరలివెళ్లి మీడియా సంస్థ అధినేతకు నివాళులర్పిస్తున్నారు. రామోజీ రావు మరణ వార్త సినీ ఇండస్ట్రీని తీవ్రంగా కలచివేసింది. ఈ నేపథ్యంలో రామోజీ మృతి పట్ల సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన మరణానికి సంతాప సూచికంగా ఆదివారం చిత్ర పరిశ్రమకు బంద్ ప్రకటించారు. ఈ మేరకు చలనచిత్ర నిర్మాతల మండలి ప్రకటన విడుదల చేసింది. ఆదివారం అన్ని షూటింగ్‌లూ నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఇదిలావుంటే ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్‌సిటీకి తరలించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. టాలీవుడ్ దర్శకధీరుడు ఎస్ఎస్ రామజౌళి, ఆయన భార్య రమా రాజమౌళి, కీరవాణి, రాజేంద్ర ప్రసాద్, ఏపీ మాజీ మంత్రి పరిటాల సునీత, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు, బ్యాడ్మింటన్ కోచ్ పు÷–లలెల గోపీచంద్ తదితరులు రామోజీ పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళు లర్పించారు.

# నేడు ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం



మొదటిపేజీ తరువాయి..

ఎన్డీఏ కూటమికి పట్టం కట్టడంతో.. ఎన్డీఏ ఎంపీలంతా కలిసి మోదీని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. దాంతో ఆయన మూడోసారి పీఎంగా ప్రమాణస్వీకారం చేసేందుకు సిద్ధమయ్యారు.

సాయంత్రం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ పార్లమెంటరీ పార్టీ తన నాయకుడిగా ఎన్నుకున్న తర్వాత జూన్ 7న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని నరేంద్ర మోదీని తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అధికారికంగా కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే గెలుపుతో మూడోసారి ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. 2014, 2019లో కాకుండా ఈ సారి మ్యాజిక్‌ఫిగర్(272)ని బీజేపీ స్వతహాగా సాధించలేకపోయింది. 240 సీట్ల వద్దే ఆగిపోయింది. దీంతో కూటమిలోని తెలుగుదేశం(టీడీపీ), జనతాదళ్ యునైటెడ్(జేడీయూ), శివసేన కీలకంగా మారాయి. మొత్తం 543 ఎంపీ సీట్లలో ఎన్డీయేకి ప్రస్తుతం 293 ఎంపీ బలం ఉంది. ఇదిలా ఉంటే మోడీ 3.0 సర్కార్‌లో మిత్రపక్షాలకు బెర్తులు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. చంద్రబాబు నాయుడు టీడీపికి నాలుగు మంత్రిత్వ శాఖలు, నితీష్ కుమార్ జేడీయూకి 2 మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం దాదాపుగా ఖరారు అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జేడీయూ నుంచి ఇద్దరు సీనియర్ నేతలైన లాలన్ సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్ల పేర్లను ప్రతిపాదించింది. ప్రస్తుతం టీడీపికి 16, జేడీయూకి 12 సీట్లు ఉన్నాయి. ఇదిలావుంటే అనధికార సమాచారం మేరకు మోడీతో పాటు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా తదితరులు ప్రమాణం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తున్న తొలి వ్యక్తిగా నరేంద్రమోదీ గుర్తింపు పొందారు. ప్రమాణస్వీకారం నేపథ్యంలో రాష్ట్రపతి భవన్ పరసరాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అదేవిధంగా భద్రతా కారణాల రీత్యా ఢిల్లీని నో ఫ్లై జోన్‌గా కూడా ప్రకటించారు. డ్రోన్‌లు, పారా గ్లైడర్‌లు, ఎయిర్ బెలూన్స్ లాంటివి ఎగుర వేయకుండా నిషేధం విధించారు. కాగా మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్, మాల్దీవ్స్ తదితర దేశాల అధినేతలు హాజరుకానున్నారు. దీంతో భద్రత కోసం పలు ప్రాంతాల్లో రహదారులన్నింటిని మూసివేయనున్నారు. ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. ఐదు కంపెనీల పారామిలిటరీ బలగాలు, కమాండోలు, డ్రోన్లు, స్నిపర్లతో బహుళ స్థాయి భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. మూడోసారి భారత ప్రధానిగా నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం రాత్రి 7.15 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం లో భారత్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన ప్రముఖుల కూడా పాల్గొనబోతున్నారు. దీనిలో సార్క్ దేశాల అతిథులను ఆహ్వానించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవుతున్నప్పుడు అతిథులకు హోటల్‌కు వెళ్లే మార్గం పూర్తిగా సురక్షితంగా ఉంటుంది. ఇది కాకుండా పొరుగు దేశాలైన భూటాన్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్, మారిషస్, సీషెల్స్ దేశాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. అతిథులందరి భద్రత కోసం తాజ్, లీలా, ఐటీసీ మౌర్య, క్లారిడ్జ్ వంటి హోటళ్లను ఇప్పటికే భద్రత పరిధిలోకి తీసుకున్నారు. ఢిల్లీలో జరగనున్న ఈ ప్రమాణ స్వీకారోత్సవ భద్రతకు సంబంధించి పారామిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీసులతో పాటు కమాండోలను రాష్ట్రపతి భవన్‌తో పాటు పలు కీలక ప్రదేశాల చుట్టూ మోహరిస్తామని భద్రతా అధికారి తెలిపారు. ఇదిలావుంటే నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ఢిల్లీ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆమెకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒకరోజు ముందుగానే శనివారం ఆమె ఢిల్లీ వచ్చారు. విమానాశ్రయానికి చేరుకున్న షేక్ హసీనాకు.. అధికారులు ఘనస్వాగతం పలికారు. విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించిన వివరాల మేరకు.. మోడీ ప్రమాణ స్వీకారోత్సవానికి శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్‌సింఘే, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్, భూటాన్ ప్రధాని తోబ్గే తదితర విదేశీ ప్రముఖులు హాజరుకానున్నారు. .ఆదివారం సాయంత్రం 7.15 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. జీ20 సమావేశాల తరహాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక ప్రమాణస్వీకారం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ము విందు ఏర్పాటు చేశారు.

## కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా సోనియా గాంధీ

మొదటిపేజీ తరువాయి..

శశి థరూర్, అజయ్ మాకెన్, కార్తీ చిదంబరం, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు పార్టీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ఛైర్‌పర్సన్‌గా సోనియా గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదట ఆమె పేరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఆ తర్వాత నేతలు గౌరవ్ గొగోయ్, తారిఖ్ అన్వర్, కె సుధాకరన్ ప్రతిపాదించగా.. ఎంపీలు సమర్థించి తీర్మానం చేశారు. కాగా, ఈరోజు ఉదయం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్ గాంధీని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. త్వరలో అధికారికంగా వెల్లడించనున్నట్లు కేసీ వేణుగోపాల్ వెల్లడించారు.

కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని ఆ పార్టీ లోక్‌సభ పక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలని సీడబ్ల్యూసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. శనివారం నాడు ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ అయ్యింది. సుమారు మూడు గంటల పాటు ఈ సమావేశం సాగింది. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల గురించి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. సిడబ్ల్యూసీ సమావేశంలో లోక్‌సభ ఎన్నికలపై, ఎన్నికల ఫలితాలపై చర్చించామన్నారు. సీబీఐ, ఈడీ సంస్థలతో కాంగ్రెస్ నేతలను బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని చెప్పారు. కాంగ్రెస్ పని అయిపోయిందని చాలా మంది కామెంట్స్ చేశారని.. ఎగ్జిట్ పోల్స్‌పై పోరాటం చేశామని కేసీ వేణుగోపాల్ చెప్పుకొచ్చారు. ఇండియా కూటమి ఎజెండాను పక్కదోవ పట్టించే విధంగా వ్యవహరించారని కేసీ విమర్శించారు. మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ కోసం చేసిన కృషిని సీడబ్ల్యూసీ సమావేశంలో అభినందించామన్నారు. ఓట్లేసిన ప్రజలకు కాంగ్రెస్ నేతలు అభినందనలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అన్నీ అబద్ధాలు చెప్పారని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. పార్టీ గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి ఈ సమావేశంలో కాంగ్రెస్ ధన్యవాదాలు తెలిపింది. రాహుల్ గాంధీ చేసిన రెండు యాత్రలు కాంగ్రెస్ గెలుపునకు కలిసి వచ్చాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. తమతో కలిసి వచ్చిన కూటమి నేతలకు సైతం కాంగ్రెస్ ధన్యవాదాలు తెలిపింది. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో కాంగ్రెస్ ముందుంటుందని కేసీ వేణుగోపాల్ ఉద్ఘాటించారు. లోక్ సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ఉండాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి, కర్నాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుక్విందర్ సింగ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తదితర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్ సభ ప్రతిపక్ష నేతను ఎన్నుకోవడంతోపాటు పలు అంశాలపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల్లో కేరళలోని వాయనాడ్ సీటును, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానాల్లో ఘన విజయం సాధించిన రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేతగా ప్రతిపాదించారు. త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు. పార్లమెంటులో ప్రతిపక్షనేతగా నాయకత్వం వహించడానికి రాహుల్ సరైన వ్యక్తి అన్నారు. ఎన్నికల ప్రచారం, గ్యారంటీలపై కూడా సమావేశంలో చర్చించామన్నారు. ఎన్నికల సమయంలో బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేసినా, కాంగ్రెస్ నేతలను బెదిరించినా.. బీజేపీకి గట్టి పోటీ ఇచ్చామన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు యోధుల్లా పోరాడారని కేసీ వేణుగోపాల్ అన్నారు. రాహుల్ గాంధీ చేసిన భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్‌కు ఓట్లు సీట్లు పెరిగాయన్నారు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే. మణిపూర్ లో రెండు సీట్లు గెలుచుకున్నామని, మహారాష్ట్రలో అతిపెద్ద పార్టీగా అవతరించామని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు. ఢిల్లీలో జరిగిన సిడబ్ల్యూసి సమావేశంలో పాల్గొన్న ఖర్గే.. ప్రజలు పార్టీపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయొద్దన్నారు. ఇండియా కూటమి పలు రాష్ట్రాల్లో గణనీయమైన పాత్ర పోషించిందని చెప్పారు. ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక హాజరైన మీటింగ్ లో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్నాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ అట సుక్విందర్ సింగ్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, అచిఅ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర రాజనర్సింహ, అటెండ్ అయ్యారు. ఏపీ నుంచి రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, జేడీ శీలం, పల్లంరాజు హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల తీర్పు విభజనవాద, విద్వేష రాజకీయాలకు 'నిర్ణయాత్మక తిరస్కరణ' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. శనివారం ఢిల్లీలో పార్టీ కార్యవర్గం (సిడబ్లుసి) సమావేశంలో ఈ విషయం స్పష్టం చేశారు. ఇండియా కూటమి పార్లమెంట్‌లోను, వెలుపలా సంఘటితంగా వ్యవహరిస్తూనే ఉండాలని ఖర్గే నొక్కిచెప్పారు. ప్రతిపక్ష నాయకుని పాత్ర పోషించాలని రాహుల్ గాంధీకి కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఖర్గే సిడబ్లుసి సమావేశంలో ప్రారంభోపన్యాసం చేస్తూ, పార్టీ ఒక వైపు 'పునరుత్థానాన్ని' వేడుక చేసుకుంటూనే, మరొక వైపు ఒకింత ఆత్మావలోకనం చేసుకోవాలని సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో పార్టీ ప్రదర్శన తన సామర్థ్యానికి, అంచనాలకు తగినట్లుగా లేదని ఆయన చెప్పారు. ప్రజలు కాంగ్రెస్‌పై తమ విశ్వాసాన్ని తిరిగి వ్యక్తం చేశారని,నిరంకుశ శక్తులకు, రాజ్యాంగం వ్యతిరేకులకు వారు గట్టి సమాధానం ఇచ్చారని ఖర్గే ఉద్ఘాటించారు. అధికార పార్టీ నియంతృత్వ, ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులకు వ్యతిరేకంగా ప్రజలు మాట్లాడారు. గడచిన పది సంవత్సరాల రాజకీయాలకు అది కచ్చితమైన తిరస్కరణ. విభజనవాద, విద్వేష రాజకీయాలకు తిరస్కరణ' అని ఆయన పేర్కొన్నారు. అననుకూల పరిస్థితుల్లో ఎన్నికల్లో గెలిచినందుకు కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపిలను ఆయన అభినందించారు.

## రామోజీరావు మరణం బాధాకరం

మొదటిపేజీ తరువాయి..

ఉండవల్లి అరుణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ హోదాలో పలు కేసులు వేశారు. డిపాజిట్ల సేకరణ ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా సాగిందని ఉండవల్లి ఆరోపణ కాగా, అందరికీ డిపాజిట్లు తిరిగి చెల్లించామని మార్గదర్శి స్పష్టం చేసింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ ద్వారా డిపాజిట్లు సేకరించకూడదని.. అయినా సేకరించారని ఆయన కేసులు వేశారు. ఆ కేసుల కారణంగా ఈటీవీ మీడియా నెట్ వర్క్ లో ఇతర రాష్ట్రాల్లో విస్తరించిన వ్యాపార సామ్రాజ్యాన్ని అమ్మేసి డిపాజిట్లు చెల్లించేశారు. తాను ఎంపీగా దిగిపోయినప్పటికీ, కాంగ్రెస్ అధికారంలో లేనప్పటికీ, ఉండవల్లి అరుణ్ కుమార్ మాత్రం నిరంతరం ఆ కేసును కొనసాగిస్తూ వచ్చారు. వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా ఏపీ సీఐడీ కూడా మార్గదర్శిపై కేసు పెట్టి, రామోజీ రావును విచారించింది. మీడియా ద్వారా తమను ఇబ్బంది పెడుతున్నారన్న ఉద్దేశంతోనే ఉండవల్లి ద్వారా వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ ఇబ్బంది పెట్టారన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పుడు ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా రామోజీరావును ప్రశంసిస్తున్నారు. ఆయన దేనికీ లొంగలేదని.. టైగర్‌గానే చనిపోయారని అంటున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీ రావు లేరనే వార్త ఆవేదన కలిగించిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. అక్షరయోధుడు రామోజీ రావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర దిగ్భ్రం÷–రతికి లోనయ్యానన్నారు. అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారని తెలిశాక.. కోలుకొంటారని భావించానని పవన్ తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. రామోజీరావు స్థాపించిన ఈనాడు పత్రిక భారతీయ పత్రికా రంగంలో పెను సంచలనంగా మారిందని పవన్ తెలిపారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించారన్నారు. ప్రజా పక్షం వహిస్తూ వాస్తవాలను వెల్లడిస్తూ, జన చైతన్యాన్ని కలిగించారని పవన్ తెలిపారు. వర్తమాన రాజకీయాలపై, పాలన తీరుతెన్నులపై నిష్కర్షగా వార్తలను అందించడమే కాదని.. ఆ వార్తలను ఉషోదయానికి ముందే పాఠకుడికి చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేయడం రామోజీరావు దక్షతను తెలియచేసిందన్నారు. ప్రజా ఉద్యమాలకు రామోజీ వెన్నుదన్నుగా నిలిచారని పవన్ అన్నారు. పత్రికాధిపతిగానే కాకుండా సినీ నిర్మాతగా, స్టూడియో నిర్వాహకులుగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా విజయాలు సాధించారన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణంతో భారతీయ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను వేదికగా చేశారన్నారు. మీడియా మొఘల్‌గా రామోజీరావు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. తను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు వెళ్ళడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయత సాధించారన్నారు. అక్షర యోధుడు రామోజీ రావు గారు అస్తమయం తెలుగు ప్రజలందరినీ కలచి వేస్తోందన్నారు. ఆయన స్ఫూర్తిని నవతరం పాత్రికేయులు అందిపుచ్చుకోవాలన్నారు. రామోజీరావు కుటుంబానికి తన తరఫున, జనసేన పక్షాన ప్రగాఢ సానుభూతిని పవన్ తెలిపారు. మీడియా దిగ్గజం, ప్రముఖ పారిశ్రామిక వేత్త రామోజీ రావు మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. 'రామోజీ రావు పేదల పక్షపాతి అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అభిప్రాయ పడ్డారు. 'అలు పెరుగని అక్షర యోధుడు. జనహితమే తన అభిమతంగా అనుకున్నారు. జీవితాంతం నిబద్ధతతో పనిచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు స్ఫూర్తితో పనిచేశారు అని' నారా లోకేశ్ అభిప్రాయ పడ్డారు. ఃూమోజీ రావు మృతిపై హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. 'తెలుగు పత్రికా రంగంలో రామోజీరావు మకుటం లేని మహారాజు. పత్రికా రంగంలో కొత్త ఒరవడి సృష్టించారు. భావితరాల పత్రికా ప్రతినిధులకు మార్గదర్శిగా నిలిచారు. చిత్రసీమలో అదేవిధంగా వెలిగిచారు. తెలుగు నేలపై అతిపెద్ద స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మించారు. తన తండ్రి ఎన్టీఆర్‌తో రామోజీరావుకు ప్రత్యేక అనుబంధం ఉండేది. రామోజీ రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి కలుగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా అని' నందమూరి బాలకృష్ణ అభిప్రాయ పడ్డారు.

## రామోజీ మృతికి ఏపిలో రెండు రోజులు సంతాప దినాలు

మొదటిపేజీ తరువాయి..

తేదీలను సంతాప దినాలుగా ప్రకటిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు జాతీయ పతాకాన్ని సగం వరకూ అవనతం చేయాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారికంగా ఏ వేడుకలు నిర్వహించ రాదని పేర్కొంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రామోజీ అంత్యక్రియలు ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్యలో హైదరాబాద్ లోని ఫిలింసిటీలో జరుగనున్నట్లు సమాచారం. అయితే తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో జరపనున్నది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఆదేశాలను సీఎస్ శాంతికుమారి జారీ చేశారు. ఫిలింసిటీకి పలువురు ప్రముఖులు వచ్చి సంతాపం ప్రకటిస్తున్నారు. రామోజీతో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకుని కంటతడి పెట్టారు.

## ఆర్థిక పరిస్థితిపై సిఎస్ ఆరా

మొదటిపేజీ తరువాయి..

తన పనిపై ఫోకస్ పెట్టారు.. శనివారం సచివాలయంలో ఆర్థిక శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆర్థిక శాఖ ఉన్నతాధికారి సత్యనారాయణ సహా ఇతర అధికారులు హాజరయ్యారు. ఏపీ ఆర్థిక స్థితి గతులపై కీలకంగా చర్చ సాగింది.. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వెంటనే నివేదిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సందర్భంగా సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ.. సీఎస్ గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.. సహచర అధికారులు సిబ్బందితో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా తన పని ఉంటుంది.. మంచి చేసేలా కృషి చేస్తాను అన్నారు.. అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలుకు కృషి చేస్తాను అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు శాయశక్తులా కృషి చేస్తాను అన్నారు.

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

## ప్రకాశం

# యథేచ్ఛగా ఆక్రమణలు చెరువులే చేలవుతున్నాయి..!!





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జూన్ 8)

సాగు నీటి వనరులను కాపాడాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు. వానలు లేక చెరువులు నిండక పోవడంతో ఆక్రమిస్తున్నారు. అదే చెరువు భూములను సాగు భూములుగా మార్చేస్తున్నారు. ఆరుతడి పంటలు, బోర్లు వేసి ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. మరి కొంత మంది ఇటుకల వ్యాపారానికి చెరువులనే అడ్డాగా చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా నీటి పారుదల శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

**చెరువులు కనుమరుగు..** యర్రగొండపాలెం నీటిపారుదల శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో 46 సాగు నీటి చెరువులు ఉన్నాయి. ఇవి కాక పంచాయితీరాజ్ పరిధిలోని చెరువులు ఇంకో 50 వరకు ఉన్నాయి. చెరువుల సరిహద్దులు గుర్తించి ఆక్రమణలు జరక్కుండా చేసేందుకు గత టిడిపి ప్రభుత్వ హయాంలో కొలతలు నిర్వహించి సరిహద్దుల చుట్టూ లోతుగా కందకాలు తీశారు. ఇలా ఒక్కో చెరువుకు రూ.5 నుంచి రూ. 10 లక్షలు ఖర్చు చేశారు. నాలుగేళ్లు తిరిగే సరికి ఈ సరిహద్దులు చెరిపేశారు. మళ్లీ యధాస్థితికి వచ్చింది.

**పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు..** చెరువుల అభివృద్ధితో పాటు వాటిని సంరక్షించాల్సిన నీటి పారుదల, రెవెన్యూ, పంచాయితీ శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలించి ఆక్రమణల పాలైతే రెవెన్యూ యంత్రాంగం సాయంతో చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నుంచి కనీస స్పందన ఉండడం లేదు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో చెరువులు కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు.

**ఆక్రమణకు గురైన చెరువులు ఇలా..** యర్రగొండపాలెం మండలంలోని గురిజేపల్లి, అమానుగుడిపాడు, వాదంపల్లి, మురారిపల్లి, రాయవరం చెరువులు పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి లేకపోవడంతో చాలాచోట్ల దీర్ఘకాలికంగా ఉండే ఉద్యాన తోటలు సాగు చేస్తున్నారు. యర్రగొండపాలెం కొప్పుకొండ పక్కనున్న జలవనరులశాఖ పరిధిలోని సాగునీటి చెరువు 350 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం 50 ఎకరాలకు పైగా పంటలు సాగు చేస్తున్నారు. సారవంతమైన భూమి కావడంతో ఏటా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. చెరువు చుట్టూ తీసిన సరిహద్దు కందకం పూడ్చేశారు. హద్దులు చెరిగిపోయాయి. పుల్లలచెరువు మండలంలోని మర్రివేముల, మల్లాపాలెం, పుల్లలచెరువు, చాపలమడుగు, చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. కొందరు అక్రమార్కులు యధేచ్ఛగా వాటిని ఆక్రమించి బోర్లు వేయించారు. పంటలు సాగు చేసుకొంటున్నారు. కొందరు ఇటుకల బట్టీలకు మట్టి తోలుకొంటూ అక్రమ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారు. త్రిపురాంతకం మండలం సోమేపల్లి గ్రామంలోని చెరువు 278 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. సాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న ఈ చెరువులో సుమారు 70 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. చెరువు సరిహద్దులు పూడ్చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్నారు. చెరువు భూముల్లో ఇటుకల వ్యాపారం చేస్తున్నారు. త్రిపురాంతకం అమ్మవారి ఆలయం ఉన్న చెరువు






# రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటు

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

తెలుగు పత్రిక రంగంలో ఎనలేని కృషి చేసిన మహనీయుడు చెరుకూరి రామోజీరావు అని, ఆయన మరణం పత్రిక రంగానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈనాడు గ్రూప్ ఆఫ్ సంస్థల అధినేత చెరుకూరు రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు పత్రిక రంగంతో పాటు సినీ, టీవీ రంగాలతో పాటు అనేక రకాల వ్యాపార సంస్థలను నిర్మించి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన మరణానికి సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్ విజయ్ కుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి , ఎర్రగొండపాలెం ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ వైవీ సుబ్బారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, టిడిపి నగర అధ్యక్షుడు కొటారి నాగేశ్వరరావు, బండారు మదన్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నాకు రాజకీయ భిక్ష పెట్టిన దేవుడు రామోజీరావు

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 8)

తనకు రాజకీయ భిక్ష పెట్టిన దేవుడు రామోజీ గ్రూపుల చైర్మన్, ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు అని, వారి మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేసి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, అదే విధంగా కొన్ని వేల మందికి ఉపాధి కల్పించి ఆదర్శ ప్రాయుడిగా అందరికీ నిలిచారన్నారు. 2004 ఎన్నికల ముందు కంభంపాటి రామ్మోహనరావుతో కలిసి రామోజీరావుని కలిశానని, రాజకీయాల్లో ఎన్నాళ్లు ఉన్నామనేది ముఖ్యం కాదని ప్రజలకు ఎంత సేవ చేసి దగ్గరయ్యామన్నది ముఖ్యమని చెప్పి ఎంతో విలువైన సలహాలను ఇచ్చారని అన్నారు. అంతేగాక
తన ఉత్సాహాన్ని చూసి రాజకీయాల్లో తప్పక రాణిస్తావని ఆశీర్వదించారని గుర్తు చేశారు. ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయామని, ఈ లోటు తనకు వ్యక్తిగతంగా తీర్చలేనిది అని అన్నారు.

# బీసీల మద్దతుతో టీడీపీ ఘన విజయం

## జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంక చిరంజీవి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలందరూ ఐక్యంగా టీడీపీకి మద్దతు తెలపడం వల్లనే తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించిందని ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంక చిరంజీవి పేర్కొన్నారు. ఉండవల్లిలోని జాతీయ ప్రధాన కార్యదర్శి మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను కలిసి శనివారం అభినందన తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్ తో చిరంజీవి మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోకు అనుగుణంగా బీసీల సమగ్ర సాధికారతకు నూతన ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు ఉంచాలని విజ్ఞప్తి చేశారు.



# దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే సోమిరెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 8)

సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శనివారం విజయవాడలో శ్రీ కనకదుర్గమ్మ గుడిని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి పూజలు అనంతరం ఆశీర్వచనం పలికి సత్కరించారు.



# యథేచ్ఛగా ఆక్రమణలు చెరువులే చేలవుతున్నాయి..!!

చాలా వరకు ఆక్రమణకు గురైంది. చెరువు చుట్టూ లోతట్టు భూమిని కబ్జాచేసి పంట భూములుగా మార్చారు. కొంతమంది యథేచ్ఛగా ఇటుకల బట్టీలు నిర్వహిస్తున్నారు. ఒడ్డుపాలెం, గణపవరం, దూపాడులోని చెరువులు చాలా వరకు ఆక్రమించారు.



# మాగుంట రాఘవరెడ్డిని కలిసిన టీడీపీ నేతలు



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు రూరల్, జూన్ 8)**
ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డి శనివారం గిద్దలూరు వచ్చిన సందర్భంగా ఆయను పలువురు టీడీపీ నాయకులు కలిసి పూల బొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. మాగుంటను కలిసిన వారిలో శివపురం మురళీకృష్ణ, బొమ్మినేని వెంకటేశ్వర్లు, మండ్లా రంగనాయకులు, ముండ్లపాడు వైస్ సర్పంచ్ కడియం శేషగిరి, చిన్నా, తదితరులు ఉన్నారు.




## రామోజీరావుకు నివాళులర్పించిన టిడిపి నాయకులు



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు రూరల్, జూన్ 8)**
గిద్దలూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు అనారోగ్యంతో స్వర్గస్తులైన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి శనివారం పూలమాలవేసి నివాళులర్పించారు. పత్రికా రంగంలో ఆయన సేవలు వెలకట్టలేనివని, ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రామోజీరావు మరణం పాత్రికేయ వ్యవస్థకు తీరని లోటు

**ఏపీఎంపీఏ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి సురేష్**



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 8)**
ఈనాడు సంస్థల అధినేత పద్మ విభూషణ్ రామోజీరావు మరణం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి సురేష్ తెలిపారు. ఆయన మరణం పత్రిక రంగానికి తీరని లోటు అన్నారు. పార్టీ జీవితంలో ఆయన ఓ తిరుగులేని మైలురాయిగా ఎదిగారన్నారు. పాత్రికేయ వృత్తిలో అలుపెరుగని పోరాటం చేసి ఎన్నో సేవలు ప్రజలకు చేసి ప్రజలలో గుర్తింపును పొందిన ఆయన మరణం పాత్రికేయులను కలిచివేసిందన్నారు. తెలుగు జాతికి వన్నె తెచ్చి నిరంకుశ పాలకులపై తన ఈనాడు పత్రిక, ఈటీవీ ద్వారా ప్రజలను చైతన్య పరిచారని కొనియడారు. ఆయన ఆత్మ ఎక్కడున్నా శాంతించాలని పాత్రికేయులు తరపున, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా కుటుంబ సభ్యులు తరఫున తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టు ఆయన తెలిపారు.

# గిరిజన పిల్లలను విద్యలో అన్ని విధాలుగా ఆదుకుంటాం

**గిరిజన పుత్రులకు ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ**

**కంజుల శ్రీకాంత్‌రెడ్డి, స్వప్న దంపతులు**





**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జూన్ 8)**
మండలంలోని పాత సింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని తాతయ్య కాలనీలో శనివారం గిరిజన కాలనీలో నివాసం ఉంటున్న చిన్నారులకు విద్యాభ్యాసం నేర్చుకునేందుకు పాఠ్యపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయడమే గాక వారిని విద్యారంగంలో ప్రోత్సహించేందుకు వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందించిన మనసున్న గొప్ప మహాదాత కుటుంబ సభ్యులు ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామానికి చెందిన కంజుల శ్రీకాంత్ రెడ్డి ఆయన సతీమణి స్వప్నల సహకారంతో వారిద్దరి మొదటి పెళ్లి రోజు సందర్భంగా ఉచితంగా నిరుపేద కుటుంబంలో పుట్టిన చిన్నారులకు విద్యాభ్యాసంకు వారికి అవసరమయ్యే పాఠ్యపుస్తకాలను వస్తూ సామాగ్రిని కంజుల శ్రీకాంత్ రెడ్డి దంపతులు వారి కుటుంబ సభ్యులు శనివారం గిరిజన పుత్రుల బాల బాలికలకు ఉచితంగా పంపిణీ చేశారు. చిన్నారులు వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా వారి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన కాలనీలో ఉండే పేదలకు ఉచిత అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ గిరిజన కాలనీలో మా పెళ్లి రోజు సందర్భంగా పేద పిల్లలకు ఇలాంటి సహాయ సహకారాలు అందించడం మాకు పూర్వ అదృష్టమని మా పెద్దల ఆశీర్వాదాలతో మేము ఈ గొప్ప కార్యక్రమాన్ని చేసినందుకు మాకు ఎంతో మనసు తృప్తి కలిగించిందని కంజుల శ్రీకాంత్ రెడ్డి ఆయన సతీమణి స్వప్న ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. పేదలకు కడుపు నిండా పిడికెడు భోజనం పెట్టి వారి ఆకలి తీర్చడమే మాకు ఉన్న గొప్ప ఉద్దేశమని కంజుల శ్రీకాంత్ రెడ్డి స్వప్నాలు అన్నారు. గిరిజన కాలనీలో ఈ కార్యక్రమం చేయడంపై మాకు ఎంతో సంతోషంగా ఉందని దంపతులు కాలనీ ప్రజలతో వారి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించిన సింగరాయకొండ మండలం శానంపూడి గ్రామానికి చెందిన న్యాయ సేవ సహాయకులు, ఫ్రెండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పంతగాని వెంకటేశ్వరు, తమకు సహకరించడం సింగరాయకొండ అప్డేట్స్ యువత రాకేష్‌కు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంజుల శ్రీకాంత్ రెడ్డి సతీమణి స్వప్న, బంధుమిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరూ కలిసి తాతయ్య కాలనీలో గిరిజన పుత్రుల సమక్షంలో వారి పిల్లలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు వస్తు సామాగ్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాంత్ రెడ్డి, స్వప్నాలు ఈ కార్యక్రమం సొంతంగా చేయడం పై గిరిజన కాలనీ పుత్రులు ఆ నూతన వధూవరులపై ప్రత్యేకంగా మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.



# తెలుగు పత్రికా రంగంలో రామోజీరావు సేవలు చిరస్మరణీయం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)

తెలుగు పత్రిక రంగంలో రామోజీరావు సేవలు చిరస్మరణీయమని పలువురు పాత్రికేయులు అన్నారు. శనివారం తెల్లవారుజామున మృతి చెందిన ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, ఆధునికతరం పాత్రికేయులు, ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకులు చెరుకూరి రామోజీరావు మృతి చెందారు. ఈ సందర్భంగా స్థానిక పెన్షనర్ల

## మీడియా ప్రతినిథులు

భవనంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పాత్రికేయులు తెలుగు పత్రిక రంగంలో ప్రజా సమస్యలను ప్రత్యేక దృష్టితో ప్రచురించేందుకు, స్థానిక వార్తలకు ప్రత్యేక ప్రధాన్యత కోసం జిల్లా స్థాయిలో ట్యాబ్లెట్లను ప్రచురించి, మొదటి పత్రికగా అభివృద్ధి చేసిన ఘనత ఈనాడు రామోజీరావుకి దక్కుతుందన్నారు. ఈనాడు జర్నలిజం స్కూల్‌తో లక్షలాది మంది నిరుద్యోగులకు పాత్రికేయవృత్తిని పరిచయం చేసిన ఘనత కూడా ఆయనకే చెందిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యాంత్రీకరణలోను, తెలుగు భాష పై పట్టు సాధించడంలోనూ రామోజీరావు కృషి అద్వితీయమని కొనియాడారు. ఆయన మృతి పత్రిక రంగానికి తీరనిలోటన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ పాత్రికేయులు



నర్రావెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు ఎం వెంకటేశ్వరరెడ్డి, ఎస్ కె అహమ్మద్, పింగళి భాను, బాజీ, రామారావు, ఓబులశెట్టి రాధాకృష్ణ, చప్పిడి శీను, దర్శి శివాజీ, మదర్, కిషోర్, సుబ్బారావు, విశ్వనాథ్, ప్రశాంత్, బాల నరసయ్య, రాయల్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల ను కలిసిన అనిల్, గౌస్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను శనివారం ఆయన నివాసంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

## సేవా సంస్థకు ఆర్థిక సాయం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)

ప్రముఖ వ్యాపారస్తులు భవాని గ్రూప్స్ అధినేత పేర్ల శ్రీనివాసరావు, పొదిలిలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై సంస్థ ఛైర్మన్ మువ్వల పార్థసారథికి రూ. 5,000లు ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. పొదిలిలో మానవత సంస్థ ఏర్పడిన తరువాత నిరుపేదలకు చేయూత నిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని భవిష్యత్‌లో ఇంకా మంచి కార్యక్రమాలు చేయాలని తనవంతుగా ఈ ఆర్థిక సాయం చేసినట్లు పేర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పొదిలి మానవత సంస్థ వారికి అభినందలు తెలిపారు.

## రంగనాయక స్వామిని దర్శించుకున్న మాగుంట రాఘవరెడ్డి



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు రూరల్, జూన్ 8)

రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామ సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయాన్ని శనివారం టిడిపి నాయకులు మాగుంట రాఘవరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి అధికారంలోకి రావడంతో స్వామివారికి మొక్కు చెల్లించేందుకు వచ్చినట్లుగా మాగుంట రాఘవరెడ్డి తెలిపారు. అర్చకులు అందించిన తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామోజీరావు మృతికి మాగుంట సంతాపం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

అక్షరదీరుడు, ఈనాడు, ఈటీవి, మార్గదర్శి, ఉషాకిరణ్ మూవీస్ , రామోజీ ఫిలిం సిటీ అధినేత, పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత, చెరుకూరి రామోజీ రావు మరణ వార్త నాకు ఎంతో దిగ్భ్రాంతి కలిగించిందని ఎంపీ మాగుంట అన్నారు. రామోజీరావు ముఖ్యంగా సినీ, వ్యాపార, మీడియా రంగంలో ప్రముఖ పాత్ర పోషించి లక్షలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. మంచితనానికి, మానవత్వానికి ఆయన నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆయన లేని లోటు ముఖ్యంగా పత్రికా రంగానికి తీరని లోటన్నారు. కీ.శే. మాగుంట సుబ్బరామిరెడ్డితో, మాగుంట కుటుంబంతో మంచి సత్ సంబంధాలు కలిగి ఉన్నారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రామోజీరావుకు ఘన నివాళులు







(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 8)

మండల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం స్వర్గస్తులైన ఈనాడు గ్రూపు సంస్థల అధినేత స్వర్గీయ చెరుకూరి రామోజీరావు కు మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి పిచ్చిరెడ్డి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, హెచ్ఎంపాడు ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, యూనిట్ ఇంచార్జ్ రెడ్డం తిరపతిరెడ్డి, మండల తెలుగు అధ్యక్షులు కందుల వెంకట సుబ్బారెడ్డి, కనిగిరి నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షులు గాయం రామిరెడ్డి, మండల టిడిపి కార్యదర్శి చీకటి వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బలసాని కోటయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తాతపూడి బుజ్జి, మండల బీసీ సెల్ అధ్యక్షులు కూరాకు బాల నారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు తాతిరెడ్డి వీర నారాయణరెడ్డి, అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జి, నియోజకవర్గ, అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## మార్కాపురం టీడీపీ ఆఫీసులో రామోజీరావుకు నివాళి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 8)


ఈనాడు, ఈటీవీ, గ్రూపు సంస్థల అధినేత స్వర్గీయ చెరుకూరి రామోజీరావు శనివారం ఉదయం హైదరాబాదులో చికిత్స పొందుతూ మరణించారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తమ్ముడు కందుల రామిరెడ్డి, పలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

## రామోజీ మృతి పత్రికా రంగానికి తీరనిలోటు


### టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

తెలుగు మీడియా మొఘల్‌గా వినుతికెక్కిన ఈనాడు పత్రిక అధిపతి చెరుకూరి రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ సంతాపం వ్యక్తపరిచారు. అటు పత్రికా, ఇటు ఎలక్ట్రానిక్ మీడియా రంగాలను వినూత్న రీతిలో తీర్చిదిద్దిన అక్షరయోధుడని రామోజీకి నూకసాని నివాళి అర్పించారు. రామోజీ నిష్క్రమణతో తెలుగు పత్రికా రంగం ఒక దిక్సూచిని కోల్పోయినట్లు అయిందని, వివిధ సంస్థల ఏర్పాటు ద్వారా అటు రాష్ట్రంలోనే కాక దేశంలో ఎంతోమందికి ఉపాధి కల్పించారని నూకసాని అన్నారు. తెలుగు పత్రికారంగానికి జవసత్వాలు చేకూర్చేలా వృత్తి విలువలు, ప్రమాణాలు, భాషా నైపుణ్యాల పెంపుదలకు నిరంతరం శ్రమిస్తూ, వేలాదిమంది పాత్రికేయులను పత్రికా లోకానికి అందించిన ఘనత రామోజీకే దక్కుతుందని నూకసాని పేర్కొన్నారు. రామోజీ ఫిలిం సిటీ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు రాష్ట్రాల ఘనతను ఆయన చాటారని, పలు వ్యాపారాలు స్థాపించి దేశవ్యాప్తంగా ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించారని రామోజీ సేవలను నూకసాని కొనియాడారు. అటువంటి మానవతావాది విజ్ఞాన సంపన్నుడు మరణించడం ఎంతో బాధాకరమని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నూకసాని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టించిన రామోజీ పేరు చిరస్థాయిగా నిలిచేలా ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల అధినేతలు తగిన చర్యలు చేపట్టాలని నూకసాని బాలాజీ విజ్ఞప్తి చేశారు.




## రామోజీరావు మృతిపై గోగినేని రామారావు దిగ్భ్రాంతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో తనదైన ముద్రవేసి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపచేసిన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబంలో జన్మించి క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగిన రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. ఈనాడు గ్రూపు సంస్థల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించారన్నారు. ఈనాడు పత్రిక స్థాపన ద్వారా మీడియా రంగంలో నూతన్య అధ్యాయానికి శ్రీకారం చుట్టారన్నారు. రామోజీరావు మృతి తెలుగువారికి తీరని లోటు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నామన్నారు.

# నాణ్యమైన విద్యకు చిరునామా ప్రభుత్వ పాఠశాలలు

## జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 8)
ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ బంగారు భవిష్యతు పునాదులు వేస్తున్నాయని, జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆమె పాఠశాల పరివాహక ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రభుత్వం విద్యార్థులకు అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. అలాగే విద్యార్థులు అవసరమైన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యునిఫాం, బ్యాగులు, షూ వంటి అన్ని రకాల ఏర్పాట్లు విద్యార్థుల కోసం చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు మెరుగైన పునాదులు వేయటంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర ఎనలేనిదన్నారు. విద్యార్థులకు వారంతపు పరీక్షలు, యునిట్ టెస్టులు, ప్రాజెక్టు వర్క్ లు, ప్రయోగశాల విద్యను అందిస్తు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు ఎక్కువగా ఆదరిస్తున్నారని ఆమె తెలిపారు. శనివారం పాఠశాల పరిధిలోని కాశిరెడ్డి కాలనీ, దేవాంగనగర్, టకారిపాలెం ప్రాంతంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేరాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి.రమణారెడ్డి, రంగారెడ్డి, సత్యగోపాల్, కాశీం, ఫిజికల్ డైరెక్టర్ పాశం సుశీల, రమాదేవి తదితరులు ఉన్నారు.

# రామోజీరావు అస్తమయం

## తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది
## ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఆత్మకూరు, జూన్ 8)



నాలుగేళ్లలోనే పాఠకుల మానసపుత్రికగా ఈనాడు మారింది. ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా సితార సినీ పత్రిక నిలిచింది. బహుముఖ ప్రజ్ఞ, కఠోర సాధన ఇదే రామోజీ అస్త్రాలు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసిందని మాజీ మంత్రి, ఆత్మకూరు నియోజవర్గ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్రవేసిన రామోజీ తెలుగు ప్రజల ఆస్తి. ఆయన మరణం తెలుగు ప్రజలకే కాదు, దేశానికి కూడా తీరని లోటన్నారు. మీడియా రంగంలో ఆయనొక శిఖరం, ఆయన ఇక లేరు అనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. నలుగురు నడిచిన బాట కాదు. కొత్త దారులు సృష్టించడం ఆయన నైజం. లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరామంగా పరిశ్రమించిన యోధుడు. రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారన్నారు. రామోజీ అస్తమయంపై వారి కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆనం తెలిపారు.

# రామోజీరావుకు ఘన నివాళులు







(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 8)
ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు మరణానికి చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు రామోజీరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రామోజీరావు సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను అందరూ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు కాటూరి వెంకట నారాయణబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, మహిళా నాయకురాలు సోమిశెట్టి శ్రీదేవి, మాజీ ఎంపీటీసీ నరసింహారావు, మాజీ వార్డు మెంబర్ షాహిద్, ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, శివాలయం మాజీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి షేక్ షబ్బీర్, మహిళా నాయకురాలు షహనాజ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్షర యోధునికి జర్నలిస్టులు ఘన నివాళి

## ఎంసీఏ, ఏపీఈజేయూ ఆధ్వర్యంలో రామోజీరావుకి ఘననివాళి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)




శనివారం ఒంగోలు ఎంసీఏ భవనంలో ఈనాడు పత్రిక అధినేత రామోజీరావుకి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంసీఏ అధ్యక్షులు వి. నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా ఏపీఈజేయూ రాష్ట్ర నాయకులు మేకపాటి మాల్యాద్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తొలుత రామోజీరావుకి జర్నలిస్టులందరూ ఘననివాళులు అర్పించారు. వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈరోజు దేశం ఒక అక్షర యోధున్ని కోల్పోయిందని, జర్నలిస్టులందరికి చాలా బాధకరమైన విషయమన్నారు. ముఖ్యఅతిథి మేకపాటి మాల్యాద్రి మాట్లాడుతూ 1974లో ఈనాడు దినపత్రికను స్థాపించినప్పటి నుంచి ప్రజల సమస్యలను గురించి ప్రభుత్వాలను చైతన్యం చేయడంలోను, ప్రశ్నించడంలోను తన శైలిలో పోరాటం జరిపిన అక్షరయోధుడు చెరుకూరి రామోజీరావు అన్నారు. అంతేగాక చిత్రనిర్మాణం టెలివిజన్ రంగంలో నూతన ఒరవడిని ప్రవేశపెట్టి అనేక వేల మందికి మార్గదర్శకుడిగా ప్రపంచప్రఖ్యాతమైన రామోజీ ఫిల్మిసిటీని నిర్మించి తెలుగు జాతికి ఘనకీర్తి చేకూర్చారన్నారు. తెలుగు భాష పట్ల ఆయనకున్న అభిమానం మరువలేమన్నారు. ఆయన మరణం పత్రిక రంగానికే గాక యావత్ సమాజానికి దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. కార్యక్రమంలో బొడ్డు శ్రీనివాసరావు, కళాంజలి సుబ్బారావు, ఉబ్బా ఆశోక్, కె.మల్లేశ్వరీ, యం.రామకృష్ణ, ఈర్ల శ్రీనివాసరావు, బి.సంజీవరావు, యస్.కె.కాలేషావలి, పి.ఏడుకొండలు, యం.సాంబశివరావు, పి.ప్రతాప్రెడ్డి, సి.హెచ్. ఆశోక్, కోరుకొండ సుబ్బారావు, పి.బాబు, జె.మారుతీ, అంగలకుర్తి ప్రసాద్, యస్.కె. హ్యూమయున్ బాషా, కె. హరిబాబు, ఎన్ సాయిరెడ్డి, ఆంజనేయులు, ఏపీఇజెయు అధ్యక్షులు పి.శేషు, కంచర్ల శివకుమార్, షేక్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సిఎం జగన్‌ను కలిసిన వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి కుటుంబ సభ్యులు



(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జూన్ 8)
యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌రావు కుటుంబ సభ్యులు శనివారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిరువురి మధ్య సుదీర్ఘంగా రాష్ట్ర రాజకీయ స్థితిగతులపై చర్చించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాలో యర్రగొండపాలెం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరువు ప్రతిష్టలు కాపాడిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సందర్భంగా మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖరరావుతో మీరు అధైర్య పడవద్దు పార్టీ ఎప్పుడూ మీకు అండగా ఉంటుందన్నారు. జిల్లాలో మీరు మాత్రమే పార్టీ పరువు ప్రతిష్ట కాపాడారన్నారు. ఈ విషయం నాకు ఎప్పుడూ గుర్తుంటుందని జగన్ చెప్పినట్లు తెలుస్తోంది. మీ సేవలు పార్టీకి ఎల్లవేళలా అవసరం. పార్టీ అన్ని విధాలుగా మీకు అండగా నిలవడమే గాక, పూర్తి సహాయ, సహకారాలు కూడా అందిస్తామని వైఎస్ జగన్మోహన్ రెడ్డి యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర రావుతో చెప్పడం ఆయనకి మరింత బలం చేకూరింది. ఏది ఏమైనప్పటికీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తాటిపర్తి చంద్రశేఖరరావు అండగా నిలుస్తానని, పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి మాట జవదాటకుండా ఆయన చెప్పిన సిద్ధాంతాలపై కట్టుబడి ఉంటారని వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి యర్రగొండపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖరరావు చెప్పడం జరిగిందని పార్టీ పెద్దలు సంతోషం వ్యక్తం చేశారు.

# చెరుకూరి రామోజీరావు మృతి పట్ల మాగుంట సంతాపం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)
అక్షరదీరుడు, ఈనాడు, ఈటివి, మార్గదర్శి, ఉషాకిరణ్ మూవీస్ మరియు రామోజీ ఫిలిం సిటీ అధినేత, పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణ వార్త తనకు ఎంతో దిగ్భ్రాంతి కలిగించిందని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రామోజీరావు ముఖ్యంగా సినీ, వ్యాపార, మీడియా రంగంలో ప్రముఖ పాత్ర పోషించి లక్షలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. మంచితనానికి, మానవత్వానికి ఆయన నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆయన లేని లోటు ముఖ్యంగా పత్రికా రంగానికి తీరదన్నారు. స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి తోను, మాగుంట కుటుంబంతో మంచి సత్ సంబంధాలు కలిగివున్నారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి ప్రఘాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు.

# రామోజీరావు అస్తమయం దిగ్భ్రాంతికరం

## జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)



శ్రీ రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది, తాను నమ్మిన విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాపక్షం వహిస్తూ మీడియా ప్రపంచంలో శ్రీ రామోజీరావు సాగించిన ప్రయాణం అసామాన్యమైందని ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ తెలిపారు. ఆయన మరణం మీడియా రంగానికి తీరనిలోటన్నారు. శ్రీ రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మీడియాకు సామాజిక బాధ్యత ఉందని బలంగా చాటారు. సారా వ్యతిరేక ఉద్యమం కావచ్చు, సమాచార హక్కు చట్టంపై అవగాహన కావచ్చు, జల సంరక్షణ కావచ్చు- పలు సామాజిక అంశాలపై ప్రజా చైతన్యం తీసుకువచ్చారన్నారు. ఒక రైతు కుటుంబం నుంచి వచ్చి మీడియా రంగంలోనే గాక సినీ నిర్మాతగా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సినీ స్టూడియో వ్యవస్థాపకులుగా, వాణిజ్య వేతగా ఆయన సాధించిన విజయాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తాయి. రామోజీరావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## రామోజీరావు మరణం పత్రిక రంగానికి తీరని లోటు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 8)

ఈనాడు వ్యవస్థాపకులు చెరుకూరి రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటు అని జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి షేక్ గయాజ్ భాష అన్నారు. ఆయన మరణం ఎంతో దిగ్భ్రాంతిని కలిగించిందని వారి కుటుంబ సభ్యులకి సంతాపం తెలియజేస్తూ రామోజీరావు ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నో అనితర సాధ్యమైనటువంటి కార్యక్రమాలకు రూపకర్తగా ఉండి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. అదే విధంగా స్టూడియోని స్థాపించి ఎక్కడా లేని విధంగా ప్రపంచంలోనే ఒక ప్రత్యేకమైనటు వంటి స్టూడియోగా ఆయన తీర్చిదిన్నటువంటి సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. స్వరాభిషేకం కార్యక్రమం ద్వారా అనేక మంది గాయనీ, గాయకులకు అవకాశం కల్పించారని, నిర్మాతగా కూడా మంచి చిత్రాలు నిర్మించారని మంచి స్టూడియోని నిర్మించి ప్రపంచంలోనే ప్రత్యేకమైనటువంటి స్టూడియోగా నిర్మించి ఆయన కీర్తి పొందారన్నారు. 1982వ సంవత్సరంలో తెలుగుదేశంపార్టీ స్థాపితం అయినప్పటి నుంచి ఆ పార్టీ అధికారంలో రావటం కోసం ఈనాడు పత్రిక ప్రత్యేకమైనటువంటి శ్రద్ధ వహించిందని అన్నారు.

## వాకాటి నారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన తేజరెడ్డి



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జూన్ 8)

భారత ప్రధాని నరేంద్ర మోడీ, భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా, బిజెపి నాయకులు అమిత్ షా ఆధ్వర్యంలో దేశంలోనూ, రాష్ట్రంలోనూ అఖండ మెజార్టీతో దూసుకుపోతున్న భారతీయ జనతా పార్టీ నాయకులు వాకాటి నారాయణరెడ్డిని అక్కంపేట బిజెపి నాయకులు చిల్లకూరు తేజ రెడ్డి శనివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలు భారతీయ జనతా పార్టీ మీద అపార నమ్మకంతో ఉన్నారని, ఆ నమ్మకంతో ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేసి భారతీయ జనతా పార్టీని ప్రజల్లో ఇంకా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

# ప్రజలందరికీ అందుబాటులో ఉంటా

### కార్యకర్తలకు అండగా నిలుస్తా
### సత్యవేడులో టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం
### ఎమ్మెల్యే ఆదిమూలంకు ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
### తొలిసభలో పార్టీ శ్రేణులు, ప్రజలను ఆకట్టుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం
### ఘాటైన వ్యాఖ్యలతో అవినీతి ఆరోపణలు
### దొంగలు పారిపోకుండా చూడాలంటూ చురకలు



(షణ్ముఖ వెలుగు, వరదాయపాలెం, జూన్ 8)

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో శనివారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ శ్రేణుల విజయోత్సవ సంబరాలు పండుగ వాతావరణంలో సందడి చేశాయి. కోనేటి ఆదిమూలం టీడీపీ తరపున ఎమ్మెల్యేగా విజయం సాధించగా, రాష్ట్రంలో కూటమి విజయం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సహాన్ని నింపింది. ఆదిమూలం ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా మండల అధ్యక్ష్యుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వియంకె కళ్యాణ మండపంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, నాయకులు ఆయనకు గజమాలలు, పుష్పగుచ్ఛాలు, భాణా సంచాలతో ఘన స్వాగతం పలికారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన ఎమ్మెల్యే ఆదిమూలం కార్తకర్తల ఆత్మీయ తొలి సమావేశంలో తన స్పీచ్ తో కార్యకర్తలకు, నాయకులను, పార్టీ శ్రేణులను, ప్రజలను ఆకట్టుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో తాను ఎదుర్కోన్న అవమానాలను చెపుతూ, గత ప్రభుత్వ పెద్ధల అవినీతి భాగోతంను ఎండగట్టారు. సూటిగా సుత్తిలేకుండా మాజీ మంత్రి పెద్దిరెడ్డిని, అనుచర గణాన్ని టార్గేట్ చేసిన ఆయన, ఇసుక, ఖనిజం, గ్రావేల్ అక్రమ రవాణాల్లో దోచుకున్న వేలాది కోట్ల రూపాయలకు సమాధానం చెప్పాలన్నారు. అవినీతి ఆరోపణలు రుజువు లను పరిశీలించి న్యాయస్థానంలో ప్రాసిక్యూట్ చేయాల్సిఉందన్నారు. దొంగలు విదేశాలకు పారిపోకుండా చూడాలని చురకలు అంటించారు. ఎంతమంది ఎన్నిరకాలుగా ఇబ్బంది పెట్టినా , తెదేపా అధినేత చంద్రబాబు అక్కున చేర్చుకుని సీటు ఇచ్చారని, అదే స్థాయిలో పార్టీ శ్రేణులు ఏకతాటిపై కృషి చేసి తన గెలుపు కు సహకరించారని , బీజేపి, జనసేన శ్రేణులకు, అందరికీ పేరుపేరున కృత్ఞతలు తెలిపారు. పార్టీలో అందరినీ కలుపుకుని సమన్వయంగా ముందుకెళ్తానని ఆయన స్పష్టం చేశారు. నా జీవితం ప్రజా సేవకు అంకితం. తన రాజకీయ జీవితం ప్రజా సేవకు అంకితం అని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, మేలైన మంచిపాలన అందిస్తానన్నారు. సమపాలన, సమన్వయం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కోన్న ఆయన, వివక్షలేని, విభేదాలు లేని , మంచి పాలన అందించడమే తన జీవిత లక్ష్యం అని పేర్కోన్నారు. ఈకార్యక్రమంలో తెదేపా పరిశీలకుడు చంద్రశేఖర్, మాజీ యంపిపి మస్థాన్, మాజీ జడ్పీటీసి సుందరరామిరెడ్డి, వికెఎన్ భాషా, కోళ్ళ చిన్నా, బాలమురళి, తులసిరామ్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## అక్షర యోధుడు రామోజీరావుకి ఘన నివాళులు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 8)

పత్రిక రంగానికి, సినీ రంగానికి వన్నె తెచ్చిన పాత్రికేయులు (ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్) రామోజీరావు అని టీడీపీ నాయకులు కొనియాడారు. రామోజీరావు మృతికి మాచర్ల తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, మాచర్ల పట్టణ తెలుగు యువత పఠాన్ బాబు ఖాన్, మంజుల అంజి, బత్తుల నీలంరాజు, దేరంగుల చిన్న దాసరయ్య, ఓర్సు నీలం రాజు, బత్తుల దుర్గారావు, బత్తుల సతీష్ కుమార్, ఉప్పుతోళ్ళ దుర్గారావు, షానవాజ్, షేక్ బాష, మహమ్మద్ హుస్సేన్, షేక్ ఇమ్రాన్ (పూల కొట్టు), తదితరులు పాల్గొన్నారు.

## మొక్కులు చెల్లించుకున్న టీడీపీ నాయకులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 8)

టిడిపి, బిజెపీ, జనసేన కూటమి అభ్యర్థులు గెలవడంతో ఒంగోలులోని కోర్టు సెంటర్లో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. టిడిపి మహిళలు, కార్యకర్తలు మహిళలు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు గెలిస్తే అదేవిధంగా ఒంగోలు నియోజకవర్గంలో దామచర్ల జనార్దన్ అఖండ మెజార్టీతో గెలవాలని మొక్కు పెట్టుకున్నామన్నారు. ఆ మొక్కును ఈరోజు తీర్చుకుంటున్నట్టు తెలిపారు. ఓటమి అభ్యర్థిని గెలిపించిన ప్రజలకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ల వెంకటరత్నం, పెద్ది శెట్టి వరలక్ష్మి, బిరం అరుణ రెడ్డి, కొక్కిలిగడ్డ లక్ష్మి, టిడిపి నాయకులు పెద్ద శెట్టి చంద్ర తదితరులు పాల్గొన్నారు.





# కన్నప్ప.. టీజర్ వచ్చేస్తోంది



'కన్నప్ప'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు మంచు విష్ణు. ఆయన టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని ముఖేష్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు నిర్మాత. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, కాజల్ తదితరులు అతిథి పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను ఇటీవలే కేన్స్ చిత్రోత్సవాల్లో ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ టీజర్‌ను ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ విషయాన్ని విష్ణు శుక్రవారం ప్రకటిస్తూ కొత్త పోస్టర్ పంచుకున్నారు. "ఈ చిత్రానికి నా గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంది. ఇక ఈ కన్నప్ప ప్రపంచంలోకి మిమ్మల్ని ఆహ్వానించకుండా ఉండలేను. జూన్ 14న టీజర్‌ని విడుదల చేస్తున్నాం. ఈ విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు మంచు విష్ణు. ప్రస్తుతం ఈ సినిమా ముగింపు దశలో ఉంది.

# ఆషికా.. మిస్ యు



'నా సామిరంగ' చిత్రంతో ప్రేక్షకుల్ని మెప్పించిన ఆషికా రంగనాథ్ ప్రస్తుతం చిరంజీవితో 'విశ్వంభర'లో సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడీ అమ్మడు మరో అవకాశం అందిపుచ్చుకుంది. ప్రస్తుతం సిద్ధార్థ్ హీరోగా ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో నాయికగా ఆషికాను ఎంపిక చేశారు. ఆమె ఈ విషయాన్ని ఇన్‌స్టాలో స్వయంగా ప్రకటించారు. ఈ సినిమాకి 'మిస్ యు' అనే పేరును ఖరారు చేసినట్లు తెలియజేస్తూ ఫస్ట్‌లుక్‌ను పంచుకున్నారు. "హృదయాన్ని కదిలించే ఈ అందమైన కథలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఇది నాకెంతో ప్రత్యేకం" అంటూ ఆ పోస్టర్‌కు ఓ వ్యాఖ్యను కూడా జత చేసింది.

# యుద్ధ భూమిలో అశ్వత్థామ

ప్రభాస్ – నాగ్ అశ్విన్ కలయికలో రూపొందిన బహుభాషా చిత్రం 'కల్కి 2898 ఎ.డి' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వాన్ని పరుగులు పెట్టిస్తోంది చిత్ర బృందం. ఇందులో భాగంగా శుక్రవారం ఈ సినిమా నుంచి అశ్వత్థామగా అమితాబ్ బచ్చన్ కొత్త లుక్ విడుదల చేశారు. అందులో ఆయన నుదుటిపై ఓ దివ్య రత్నాన్ని ధరించి.. చేతిలో ఓ అస్త్రం పట్టుకుని యుద్ధ భూమిలో నిల్చొని కనిపించారు. ఆయన చుట్టూ కొందరు వ్యక్తులు నేలపై పడి ఉండగా.. తన వెనుక ఓ చిత్రమైన భారీ వాహనం ఆగి ఉండటం ఆసక్తికరంగా ఉంది. వినూత్నమైన సైన్స్ ఫిక్షన్ కథతో ముస్తాబైన ఈ చిత్రం ఈ నెల 27న థియేటర్లలోకి రానుండగా.. ఈ నెల 10న ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఇందులో దీపిక పదుకొణె, కమల్‌హాసన్, దిశా పటానీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. సంతోష్ నారాయణన్ సంగీతమందించారు.



# 'మట్కా' సన్నాహాలు..




వరుణ్ తేజ్ నటిస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. నవీన్ చంద్ర, కిశోర్, రవీంద్ర విజయ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 19నుంచి ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని చిత్ర వర్గాలు శుక్రవారం ప్రకటించాయి. దీనికోసం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్‌ను నిర్మిస్తోంది చిత్ర బృందం. ఆ సెట్‌లోనే వరుణ్‌పై యాక్షన్‌తో పాటు కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. 1958-1982 మధ్య కాలంలో దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక వాస్తవ సంఘటనను ఆధారం చేసుకొని అల్లుకున్న కథ ఇది. వైజాగ్ నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో వరుణ్ నాలుగు భిన్న గెటప్పుల్లో కనిపించనున్నారు. ఇప్పటికే సగ భాగానికి పైగా చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతమందిస్తున్నారు. ఎ.కిశోర్ కుమార్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# రివ్యూ: సత్యభామ..

**చిత్రం:** సత్యభామ్మ నటీనటులు: కాజల్, నవీన్ చంద్ర, ప్రకాశ్‌రాజ్, నాగినీడు, హర్షవర్ధన్, రవి వర్మ, తదితరుల్మ్మ సంగీతం: శ్రీచరణ్ పాకాల్మ్మ సినిమాటోగ్రఫీ: విష్ణు బెస్మ్మి ఎడిటింగ్: కోదాటి పవన్‌కల్యాణ్మ్మ నిర్మాత: బాబీ తిక్క, శ్రీనివాస్ తక్కలపెల్మ్మి రచన, దర్శకత్వం: సుమన్ చిక్కాల్మ్మ విడుదల: 07-06-2024 తెలుగులో సినిమాల సీజన్ మొదలైపోయింది. వారం వారం మూడు సినిమాలు చొప్పున ( ే ఎ క ్ ు క ్ ం ల ముందుకొస్తున్నాయి. ఈ వారం ఆ సంఖ్య ఇంకా ఎక్కువే. వీటిలో ఒకటి... 'సత్యభామ'. నాయికా ప్రధానమైన ఈ సినిమాలో కాజల్ ప్రధాన పాత్ర పోషించారు. హిట్ సినిమాల దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పణలో, ఆయన స్క్రీన్‌ప్లే రచనలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రచార చిత్రాలు ఆసక్తిని రేకెత్తించాయి. మరి చిత్రం ఎలా ఉంది?కాజల్ యాక్షన్ మోడ్‌లో అదరగొట్టిందా?




**కథేమిటంటే:** కె. సత్యభామ షి టీమ్‌లో ఏసీపీ స్థాయిలో పనిచేస్తుంటారు. చూడటానికి శాంతంగా కనిపించినా, నేరస్థుల నుంచి నిజాలు రాబట్టడంలో దిట్ట. తనకు అప్పజెప్పిన కేసుల్ని అంత సులభంగా వదిలిపెట్టదని పేరు. రచయిత అమరేందర్ (నవీన్‌చంద్ర)ని ఇష్టపడి పెళ్లి చేసుకున్న ఆమె వ్యక్తిగత జీవితానికంటే, వృత్తికే ఎక్కువ సమయం కేటాయిస్తుంటుంది. షి టీమ్‌లో పనిచేస్తున్నప్పుడే హసీనా అనే ఓ బాధితురాలు గృహ హింసని అనుభవిస్తూ సాయం కోసం సత్యభామ దగ్గరికి వస్తుంది. నీకేం కాదు, అంతా నేను చూసుకుంటానని ధైర్యం చెప్పి పంపించాక, భర్త చేతిలో దారుణ హత్యకి గురవుతుంది. హసీనా హత్య సత్యభామని ఎంతో కలచివేస్తుంది. హసీనాతోపాటు, ఎంతో మంది జీవితాలతో ఆడుకున్న ఆ నేరస్థుడిని పట్టుకునే క్రమంలో సత్యభామకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఆ కేసుని ఆమె వ్యక్తిగతంగా తీసుకోవడానికి కారణమేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఎలా ఉందంటే: పరిశోధన ప్రధానంగా సాగే ఓ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ తరహా కథలు ఈ మధ్య తెలుగులో తరచూ వస్తున్నాయి. ఓ నేరం చోటు చేసుకుంటుంది. అది ఎవరు చేశారనేది అంతుచిక్కదు. ఎలాంటి ఆధారాలు దొరక్కుండా అత్యంత పకడ్బందీగా చేసిన ఆ నేరం వెనక గుట్టుని విప్పేందుకు ఓ పోలీస్ అధికారో లేదంటే ఓ డిటెక్టివో లేదంటే, బాధితుడో లేక అతని తాలూకూ వ్యక్తులో రంగంలోకి దిగుతుంటారు. ఆ క్రమంలో ఎదురయ్యే సవాళ్లు, వెలుగులోకి వచ్చే అసలు నిజాలు, కేసు ముడి వీడే క్రమం ఎలా సాగిందనేదే ఈ కథలకి కీలకం. 'సత్యభామ' కూడా ఆ తాను ముక్కే. కాకపోతే ఇక్కడ నేరం ఎవరు చేశారనేది ముందే తెలిసిపోతుంది. అతన్ని వెతికి పట్టుకోవడమే పని. పైగా కేస్‌ని ఛేదించేది ఓ మహిళా పోలీస్ అధికారి. ఆమె కేస్‌ని వ్యక్తిగతంగా తీసుకునే క్రమంలో పండిన భావోద్వేగాలు ఈ సినిమాని కాస్త ప్రత్యేకంగా మార్చేశాయని చెప్పుకోవాలి. కొత్త కథేమీ కాదు కానీ, ఇలాంటి సినిమాలకి కథనమే కీలకం. మంచి రచయితగా పేరున్న శశికిరణ్ తిక్క కథనం పరంగా తనదైన ప్రభావం చూపించే ప్రయత్నం చేశారు.పరిశోధనాత్మక కథల్లో రకరకాల అనుమానాల్ని రేకెత్తిస్తూ, చివరికి ఎవరూ ఊహించని ముగింపుని ఇస్తుంటారు. ఇందులో కూడా అదే చేశారు కానీ, అనుమానాల్ని రేకెత్తించే క్రమంలో ఉపకథల్లాగా కొత్త సంఘటనల్ని, కొత్త పాత్రల్ని తెరపై చూపిస్తూ వెళ్లడంతో అసలు కథ పక్కదారి పడుతుంది. అసలు నిందితుడు ఎక్కడా అనే ఉత్కంఠ క్రమంగా సడలిపోతూ, మధ్యలో వచ్చే వీడియో గేమ్స్ నేపథ్యం, మహిళల అక్రమ రవాణా, టెర్రరిజం తదితర అంశాలు ఎక్కువ ఫోకస్ అవుతాయి. అయితే షి సేఫ్ యాప్ ప్రాధాన్యం గురించి చెప్పే సన్నివేశాలు ఉపయోగకరంగా ఉంటాయి.

హీరోయిన్ క్యారెక్టరైజేషన్‌లో బలం లేదు.సత్యభామ శక్తిమంతమైన పోలీస్ అధికారిగా పరిచయం అవుతుంది కానీ... అందుకు తగ్గట్టుగా ఆ పాత్రని మలచలేదు. నిందితుడినీ, ఆధారాల్ని చేజేతులా వదిలేస్తూ, మళ్లీ వాటి కోసమే అన్వేషించే ఆ పాత్రలో ఏ కోశానా బలం, సహజత్వం కనిపించదు. సత్యభామ తన పరిశోధనతో వెలుగులోకి తీసుకొచ్చిన విషయాల కంటే కూడా, పతాక సన్నివేశాల్లో ఓ పాత్ర తనంతట తాను చెప్పే విషయాలే **ఆసక్తికరంగా అనిపిస్తాయి. కొన్ని మలుపులు, పతాక సన్నివేశాలు మెప్పిస్తాయి.**

**ఎవరెలా చేశారంటే:** ఎక్కువగా కమర్షియల్ సినిమాల్లో, పక్కా కమర్షియల్ హీరోయిన్‌గా కనిపించిన కాజల్ అగర్వాల్ నాయికా ప్రధానమైన పాత్రలో కనిపించడం కొత్తగా అనిపిస్తుంది. సత్యభామ పాత్రకు తగ్గట్టుగా హుషారుగానే కనిపించారామె. పోరాట ఘట్టాల్లోనూ




ఆమె కష్టం కనిపిస్తుంది. నవీన్‌చంద్రతో కలిసి ఓ సన్నివేశంలో భావోద్వేగాలు కూడా పలికించింది. ఆమె పాత్ర మినహా, ఇతర మరే పాత్రకూ ప్రాధాన్యం లేదు. ప్రకాశ్‌రాజ్, హర్షవర్ధన్, నాగినీడు నటులున్నా వాళ్ల ప్రభావం ఎక్కడా కనిపించదు. మిగిలిన ఏ పాత్ర కూడా ప్రభావం చూపించదు. నవీన్‌చంద్ర రచయితగా కనిపిస్తారు. ఆయనకు నటించేందుకు పెద్దగా ఆస్కారం దొరకలేదు. సాంకేతికంగా సినిమా ఒకే. కెమెరా, సంగీతం, ఎడిటింగ్ విభాగాలు మంచి పనితీరుని కనబరిచాయి. రచన పరంగా లోపాలు కనిపిస్తాయి. సుమన్ చిక్కాల మేకింగ్‌లోనూ బిగి కొరవడింది. కాళికాదేవి కోపం, సీతాదేవిలోని శాంతం.. అనీ, ఆ సత్యభామ ఆయుధం చేతబూని యుద్ధం చేస్తే, ఈ సత్యభామ ఆయుధం వదిలిపెట్టి యుద్ధం చేసిందనీ... ఇలా రైమింగ్‌తో కొన్ని సంభాషణలు వినిపిస్తాయి. ఆ సంభాషణలకి తగ్గట్టుగా కథలో గాఢత ఉందో లేదో చూసుకోవాల్సింది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com